క్లుప్తంగా

డాక్టరేట్ ప్రదానం

వైవీయూ : వైవీయూ అప్లైడ్ మేథమేటిక్స్ స్కాలర్ ఎ. మల్లీశ్వరికి విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. అప్లైడ్ మ్యాథమేటిక్స్ సహ ఆచార్యులు డాక్టర్ బి.శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో 'హీట్ ట్రాన్స్‌ఫర్ కేరక్టర్ స్టిక్స్ ఆఫ్ నానోఫ్లూయిడ్స్ ఇన్ డిఫరెంట్ కాన్ఫిగరేషన్' అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను ఈమెకు డాక్టరేట్ ప్రదానం చేశారు.

నిరసన

కడప ఎడ్యుకేషన్ : కడప మరియాపురం బిషప్ హౌస్ వద్ద వెంకటసుబ్బమ్మ అనే మహిళ ఎయిడెడ్ టీచర్ పోస్టు కోసం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించింది. బద్వేల్ కొత్త చెరువుకు చెందిన వెంకటసుబ్బమ్మ ఎయిడెడ్ టీచర్ పోస్టు రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేసినట్లు తెలిసింది. ఈ విషయమై బిషప్‌ను కలిసి మాట్లాడేంత వరకు వెళ్లలని ఆమె తెలిపింది. దీంతో బిషప్ హౌస్ యాజమాన్యం ఎయిడెడ్ టీచర్ పోస్టుకు టెట్ రాసి ఉండాలని తెలియచేసి ఆమెను పంపించినట్లు తెలిసింది.

నూతన కార్యవర్గం ఎన్నిక

కడప ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ సీఆర్‌పీడబ్ల్యూ (క్లస్టర్ రీసోర్స్‌పర్సన్ వెల్ఫేర్ అసోసియేషన్) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా గోవర్ధన్ (కడప) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడలోని జాక్ అండ్ జిల్ రైల్వే పాఠశాలలో ఏపీ సీఆర్ పీడబ్ల్యూ రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 2019 నుండి 2024 వరకు రాష్ట్ర అధ్యక్షులుగా పనిచేసిన గోవర్ధన్‌ను ఈ ఏడాది రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే రాష్ట్ర అధ్యక్షులుగా రాంజీ ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా డి. నాగేశ్వరరావును, ట్రెజరర్‌గా వెంకటేష్, కన్వీనర్‌గా నాగేశ్వరరావు, కో కన్వీనర్‌గా మధు(కడప), వేణుగోపాల్‌ను, మహిళా కార్యదర్శిగా సరళ కుమారి, సురేంద్రకుమారి లను కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

చిన్నచౌక్ సీఐగా తేజమూర్తి



కడప అర్బన్ : కడప నగరంలోని చిన్నచౌక్ సీఐగా ఎస్. తేజమూర్తి సోమవారం బాధ్యతలు చేపట్టారు. 2002 బ్యాచ్‌కు చెందిన ఆయన కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాలలో ఎస్ఐగా పనిచేశారు. 2017లో సీఐగా పదోన్నతి పొందారు. ప్రస్తుతం కర్నూలు జిల్లా ఆదోని ఒన్‌టౌన్ సీఐగా పనిచేస్తూ కడప చిన్నచౌక్‌కు బదిలీ అయ్యారు.

ముగ్గురు అరెస్ట్



నిందితులు వివరాలు తెలుపుతున్న సీఐ

కడప అర్బన్ : కడప మార్కెట్ యార్డ్ సమీపంలో సీఐ జి. ఇబ్రహీం ఆధ్వర్యంలో సోమవారం ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 30 వేలు విలువైన 3.2 కిలోల గంజాయిని, రూ. 15,110 నగదును, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిలో శంకరాపురానికి చెందిన గంటా రాజేష్‌కుమార్, పెద్దబెస్తవీధికి చెందిన చిరుబోయిన సుధీర్, రామాంజనేయపురానికి చెందిన గిరిశంకర్ ఉన్నారు.

సీపీఆర్‌పై అవగాహన ఉండాలి

కడప ఎడ్యుకేషన్: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు సీపీఆర్‌పై అవగాహన పెంచుకోవాలని రిమ్స్ ఆసుపత్రి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వరసుబ్రమణ్యం, డాక్టర్ చైతన్య, డాక్టర్ కౌశిక్‌లు సూచించారు. సోమవారం కడప హౌసింగ్‌బోర్డ్ కాలనీలోని మున్సిపల్ గాంధీనగర్ ఉన్నత పాఠశాలలో సీపీఆర్ కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గుండెపోటు వచ్చిన సమయంలో సంబంధిత వ్యక్తులకు సీపీఆర్ చేయాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సురేష్, సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి పాల్గొన్నారు.

దొంగ పరారీ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని ప్రకాష్ నగర్ ఓం శాంతి రోడ్డు అరవింద్ నగర్‌లో సోమవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో ఓ దొంగ ఇంట్లోకి చొరబడేందుకు యత్నించాడు. స్థానికులు గమనించి కేకలు వేయడంతో అతడు పరారయ్యాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

యోగాపై అవగాహన

కడప కల్చరల్ : కడప నగరం అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలోని మొదటి సంవత్సరం విద్యార్థులకు సోమవారం యోగా, ధ్యానంపై విశ్వాత్మ పిరమిడ్ కేంద్రం వ్యవస్థాపకులు జీవీ శేషారెడ్డి అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సుధాకర్‌రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. యోగాగురువు శేషారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు యోగా, ధ్యానం చేస్తే జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, క్రమశిక్షణ, అంకితభావం పెరుగుతాయన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కడప రూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతామని కడప ఎమ్మెల్యే మాధవీ రెడ్డి అన్నారు. సోమవారం కడప నగరంలోని ఎన్జీఓ కాలనీలో నూతన రేషన్ షాపును ఆమె ప్రారంభించారు. అనంతరం ద్వారకానగర్‌లోని తన నివాసంలో ప్రజా దర్బార్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

పర్యవేక్షణ కొరవడి

గాడి తప్పుతున్న బడి

సర్కారు బడి మళ్లీ తడబడుతోంది.. గత ప్రభుత్వం సర్కారు బడులకు జీవం పోసింది. కార్పొరేట్ స్థాయి హంగులు తీసుకొచ్చింది. రంగులు అద్ది.. మెరుగులు దిద్దింది. ఐదేళ్లు కొత్త ఒరవడితో చదువుల విప్లవం సాగింది. కొత్త ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలల్లోపే చతికిలబడుతోంది. విద్యా వ్యవస్థపై సరిగా దృష్టి సారించకపోవడంతో.. ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. అంతా సర్దుబాట్లతోనే నెట్టుకురావాల్సి వస్తోంది. పాఠశాలలు తెరిచి 50 రోజులు దాటినా.. విద్యార్థుల చేతికి ఇంకా కొన్ని పాఠ్యపుస్తకాలు అందలేదు. విద్యా కిట్ల పంపిణీ పూర్తి కాలేదు. మధ్యాహ్న భోజనం రుచి తగ్గుతూ వస్తోంది. అమ్మ ఒడి వంటి ప్రోత్సాహం ఇవ్వకపోవడంతో.. పేద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అవస్థలు పడుతున్నారు.



కడప నగరంలోని నాగరాజుపేట హైస్కూల్లో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న హెచ్‌ఎం, పీఈటీ

- వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత
- పలు పాఠశాలల్లో సింగల్ టీచర్స్‌తోనే బోధన
- కొన్ని స్కూళ్లలో పనిచేయని మంచినీటి పథకాలు
- ఇస్కాన్ భోజనంపై పెదవి విరుస్తున్న విద్యార్థులు
- పలు స్కూళ్లలో అందని రాగిజావ

134	664	17739	100	34
కడప నియోజకవర్గంలో ఉన్న మొత్తం పాఠశాలలు	మొత్తం ఉపాధ్యాయుల సంఖ్య	విద్యార్థుల సంఖ్య	ఇస్కాన్ భోజనం అమలవుతున్న పాఠశాలలు	వంట ఏజెన్సీల ద్వారా భోజనం అందిస్తున్న పాఠశాలల సంఖ్య

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న పలు సమస్యలతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం విద్యార్థులకు సక్రమంగా స్టూడెంట్ కిట్స్ అందించలేదు. చాలా మంది విద్యార్థులకు ఈ ఏడాది అందించిన యూనిఫాం క్లాత్, బూట్లు సరిపోకపోవడంతో వాటిని వేసుకునేందుకు విముఖతను వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. అలాగే విద్యార్థులకు చదువుతో పాటు పౌష్టికాహారం అందించాలనే గత ప్రభుత్వ లక్ష్యాన్ని సక్రమంగా అమలు చేయడం లేదు. చాలా పాఠశాలల్లో మెను సక్రమంగా అమలు చేయడంతో పాటు రాగిజావ కూడా అందించడం లేదని పలువురు విద్యార్థులు తెలిపారు. దీంతోపాటు మధ్యాహ్న భోజనం నాణ్యత సరిగా ఉండటం లేదని పలువురు విద్యార్థులు పెదవి విరుస్తున్నారు.



మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో పనిచేయని మినరల్ వాటర్ ప్లాంట్

విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా లేని ఉపాధ్యాయులు..

- కడప నగరంలో చాలా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా ఉపాధ్యాయులు లేరు. దీంతో విద్యావాలంటీర్లతో బోధన సాగిస్తున్నారు.
- కడప నగరంలో నాగరాజుపేట ప్రైమరీ పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు 173 మంది విద్యార్థులు ఉన్నారు. విద్యార్థులకు తగ్గట్టుగా 7 మంది ఉపాధ్యాయులు ఉండాలి. కానీ కేవలం నలుగురు మాత్రమే ఉపాధ్యాయులు ఉన్నారు. మిగతా ఇద్దరు వాలంటీర్లతో బోధన సాగిస్తున్నారు.
- గాంధీనగర్ ప్రాథమిక పాఠశాలలో 160 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ కూడా ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. ఇక్కడ కూడా 5 మంది ఉపాధ్యాయులుంటే ఇద్దరు వలంటీర్లు ఉన్నారు.
- 20వ వార్డు గాండ్లస్ట్రీట్ నగరపాలక ప్రాథమిక పాఠశాలలో 162 మంది విద్యార్థులు ఉన్నారు. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా 6 మంది ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 5 మంది టీచర్లు ఉన్నారు. వీరిలో ఒకరు మెటర్నిటీ లీవులో ఉన్నారు. మరో టీచర్ ఈ నెలలో పదవీ విరమణ కానుంది. దీంతో ఉపాధ్యాయుల కొతర వేధిస్తోంది.
- గాంధీనగర్ హైస్కూల్‌లో 905 మంది విద్యార్థులు ఉన్నారు. అయితే ఇక్కడ ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. హిందీ సబ్జెక్టుకు ముగ్గురు ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా.. కేవలం ఒకరు మాత్రమే ఉన్నారు. మిగతా ఇద్దరు విద్యావాలంటీర్లతో బోధన సాగిస్తున్నారు. అలాగే ఫిజికల్ డైరెక్టర్లు కూడా ముగ్గురు ఉండాల్సి ఉంటే కేవలం ఒకరు మాత్రమే ఉన్నారు. ఆయనకు కూడా ఆరోగ్యం సరిగా లేదని పిల్లలు తెలిపారు. దీంతో వ్యాయాయ విద్య కుంటుపడుతోంది.
- నాగరాజుపేట మున్సిపల్ హైస్కూల్లో 381 మంది విద్యార్థులు ఉన్నారు. ఉపాధ్యాయులు 14 మంది ఉన్నారు. వీరిలో హిందీ సబ్జెక్టుకు ఉపాధ్యాయులు లేకపోతే వాలంటీర్లతో బోధనలు సాగిస్తున్నారు.

ఏకోపాధ్యాయ పాఠశాలలు..

కడప నగరంలోని పాతకడప రెగ్యులర్, నబీకోట, రవీంద్రనగర్ తెలుగు, లోహియనగర్ ఉర్దూ, ఇండస్ట్రియల్ ఎస్టేట్ స్కూల్, ముత్తరాసుపల్లె, టీఆర్ స్ట్రీట్, వక్కలపేట, ఖలీల్‌నగర్, ప్రభుత్వ బాలికల పాఠశాల, బచ్చుపల్లె రెగ్యులర్ పాఠశాలల్లో ఒక ఉపాధ్యాయుడు మాత్రమే పనిచేస్తున్నారు. ఇక్కడ పనిచేసే ఉపాధ్యాయులు అత్యవసర పనుల మీద సెలవులో వెళితే ఇక్కడ బోధన కుంటు పడినట్లే. లేదంటే పక్క పాఠశాల నుంచి ఒక ఉపాధ్యాయుడినో లేక విద్యావాలంటీర్‌ను ఏర్పాటు చేసి బోధన సాగించాలి.

సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత..

గౌస్‌నగర్ యూపీ, బచ్చర్‌స్ట్రీట్, అగాడి స్ట్రీట్‌తో పాటు శాంతినగర్ హైస్కూల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. ఇక్కడ కూడా బోధన కుంటుపడుతోంది. టీచర్ల కొరత సమస్యను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

చాలా మందికి బూట్లు సరిపోవడం లేదు



ఈ ఏడాది ప్రభుత్వం పాఠశాలలకు అందించిన బూట్లు చాలామందికి సైజులు సరిపోలేదు. దీంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఖచ్చితమైన కొలతలు తీసుకుని ఇచ్చి ఉంటే అందరికీ బాగుండేవి. ఇచ్చిన బూట్లు వినియోగపడేవి.

- సురేష్, 9వ తరగతి విద్యార్థి, కడప

నాణ్యమైన భోజనం అందించాలి



ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతతో అందించాలి. ప్రతి రోజు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని వడ్డించాలి. దీంతోపాటు చిక్కీ, కోడిగుడ్డు, రాగిజావను కూడా విద్యార్థులకు సక్రమంగా అందించాలి. అప్పుడే ఫలితం ఉంటుంది.

- భాగ్యలక్ష్మి, కడప

విద్యారంగంపై నిర్లక్ష్యం తగదు..



ప్రభుత్వం మారినంత మాత్రాన విద్యార్థుల భవిష్యత్తు కోసం చేపట్టిన పథకాలు మరువరాదు. ప్రస్తుత ప్రభుత్వం నాడు– నేడు మన పాఠశాల పథకం కోసం నిధులను కేటాయించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలి.

- నాగమునిరెడ్డి, పదవీ విరమణ డిప్యూటీ ఈఓ

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా..



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలి. ప్రతి ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఇటీవల పదవీ విరమణ చేసిన హెచ్‌ఎం, ఉపాధ్యాయుల స్థానంలో ప్రయోషన్లు ఇచ్చి భర్తీ చేయాలి. నాణ్యమైన విద్యాబోధన అందించేలా చర్యలు తీసుకోవాలి.

- రామాంజనేయులు, ఎస్‌టీఎఫ్, రాష్ట్ర అధ్యక్షుడు

హామీలు నెరవేర్చాలి...



ఎన్నికల ముందు కూటమి నేతలు ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చాలి. ఇంట్లో ఎంత మంది విద్యార్థులు ఉంటే అందరికీ తల్లికి వందనం ఇస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు ఆ విషయంలో తప్పించుకునే ధోరణిలో ప్రభుత్వం వ్యవహరిస్తోంది. బడులలో విద్యార్థుల సంఖ్యకు తగినట్లుగా టీచర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలి. పాఠశాలల్లో మౌలిక వసతులు కచ్చితంగా కల్పించాలి. మెనూ కూడా కచ్చితంగా అమలు చేయాలి

- జయవర్థన్, అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఏకోపాధ్యాయులతో ఇబ్బందులు..



చాలా పాఠశాలల్లో ఏకోపాధ్యాయులతో బోధన సాగిస్తున్నారు. ఇది విద్యార్థులకు ఇబ్బందికరం. అలాగే ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను కూడా వెంటనే భర్తీ చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలి. ఈ విషయంలో ప్రభుత్వం స్పందించాలి.

- డీఎం ఓబులేసు, గ్రేటర్ రాయలసీమ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

• మధ్యాహ్న భోజనంపై పెదవి విరుపు..

కడప నగరంలో 134 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 100 స్కూళ్లలో ఇస్కాన్ భోజనం సరఫరా అవుతుండగా మరో 34 పాఠశాలల్లో ఏజెన్సీల ద్వారా మధ్యాహ్న భోజనం అమలవుతోంది. అయితే ఇస్కాన్ సరఫరా అవుతున్న పాఠశాలల్లో మాత్రం భోజనంపై విద్యార్థులు పెదవి విరుస్తున్నారు. భోజనం, కూరలు చప్పగా ఉంటాయని విద్యార్థులు తెలిపారు. దీంతోపాటు పులిహోర, చిత్రాన్నం పెట్టిన రోజు వాటిని సరిగా కలపరని పిల్లలు తెలిపారు. నాన్ ఇస్కాన్ పాఠశాలల్లో మాత్రం భోజనం బాగానే పెడతారని పలువురు విద్యార్థులు తెలిపారు.



ఇస్కాన్ వారు సరఫరా చేస్తున్న మధ్యాహ్న భోజనం



నీళ్లనీళ్లుగా ఉన్న పప్పు


జ్ఞాన సంపదతోనే ఆర్థిక సంపద



వెబినార్‌లో పాల్గొన్న వైవీయూ వీసీ, కన్వీనర్

వైవీయూ: జ్ఞాన సంపదతోనే ఆర్థిక సంపద సాధ్యపడుతుందని యోగివేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి అన్నారు. 'ఆర్థిక ప్రణాళికతో సంపద సృష్టి' అన్న అంశంపై జాతీయ వెబినార్ సోమవారం వైవీయూ కామర్స్ శాఖ, అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. వెబినార్ కన్వీనర్, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి సమన్వయం చేయగా, ఆచార్య కె. కృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రణాళిక బద్ధమైన విధానాల వల్లనే ఆర్థిక పరిపూర్ణత సాధించగలుగుతామన్నారు. వెబినార్ కన్వీనర్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి మాట్లాడుతూ 'ధనం మూలమ్ ఇదం జగత్' అన్నట్లు వ్యక్తుల అవసరాలకు సమాజ వివిధ అంశాలకు ఆర్థిక వనరులు ప్రాథమికమైనవని, 'ఆర్థిక ప్రణాళిక ద్వారా సంపద సృష్టి' జరుగుతుందన్నారు. పెట్టుబడుల్లో పితామహుడైన వారెన్ బఫెట్ జీవితం గురించి వివరించారు. వెబినార్ కు దక్షిణాది రాష్ట్రాలతో పాటు చత్తీస్‌ఘడ్, జమ్మూ కాశ్మీర్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి 1, 018 మంది అధ్యాపకులు, స్కాలర్లు విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (ఎస్ఈబీఐ) పూర్వపు డి.జి.ఎం, అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ కన్సల్టెంట్ సూర్య కాంత్ శర్మ కీలకోపన్యాసం చేస్తూ రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులు రిస్కుతో కూడుకున్నవన్నారు. బంగారంపై పెట్టుబడుల వల్ల 30శాతం వరకు నష్టపోతామన్నారు. దీర్ఘకాల పెట్టుబడులకు షేర్ మార్కెట్ మంచిదని అయితే ఆ రంగంలో జ్ఞానం అవసరం అన్నారు. లా కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగాల డీన్ ఆచార్య వై. సుబ్బరాయుడు, కామర్స్ శాఖ విభాగాధిపతి ఆచార్య జి. విజయభారతి, సహాయ ఆచార్యులు డాక్టర్ జి హరినాథ్ మాట్లాడారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఉప ప్రధానాచార్యులు ఆచార్య పి. పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకించాలి



బద్వేల్ ఎమ్మెల్యే సుధకు వినతి పత్రం ఇస్తున్న జై భీమ్ మాలమహాసేన నాయకులు

కడప కార్పొరేషన్ : ఎస్సీ వర్గీకరణను తీవ్రంగా వ్యతిరేకించాలని జై భీమ్ మాల మహాసేన అధ్యక్షుడు పి. సంపత్ కుమార్ కోరారు. సోమవారం బద్వేల్ ఎమ్మెల్యే డా. దాసరి సుధకు ఆయన వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంపత్ కుమార్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ వల్ల మాలలకు కలిగే నష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలని, న్యాయ పోరాటంలో భాగస్వామ్యం కావాలని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న ఎస్సీ ఉప కులాలు 56 ఉండగా, దేశంలో ఎస్సీ ఉప కులాలు 1126 ఉన్నాయన్నారు. వీటిని కేవలం రాజకీయ ప్రాధాన్యతతో విడదీయాలనుకోవడం దారుణమన్నారు. వర్గీకరణ జరిగితే మాలలకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. ఎస్సీలకు ఉన్న 15 శాతం రిజర్వేషన్‌లో కేవలం 11 శాతం మాత్రమే అమలవుతోందని, ప్రస్తుత జనాభా ప్రకారం రిజర్వేషన్ శాతాన్ని పెంచాల్సింది పోయి కుటిల రాజకీయాలతో ఎస్సీల మధ్య చిచ్చుపెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రంలో అన్ని నియోజక వర్గాల్లో ఉన్న మాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు జాతి ప్రయోజనాలు కాపాడేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహాసేన ప్రతినిధులు శ్యాంసన్, జార్జి, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఇదేమి చోద్యం!

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప ఆర్టీసీ బస్టాండులోని రిజర్వేషన్ పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన ఓ బోర్డు ప్రయాణీకులను నివ్వెర పరుస్తోంది. రిజర్వేషన్ పాయింట్ వద్ద అందుకు సంబంధించి బోర్డును ఏర్పాటు చేయాల్సి ఉండగా రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డిల ఫోటోలతోపాటు 'కడప ఎమ్మెల్యే గారి తాలూక కార్యాలయం' అని రాయడం పలు విమర్శలకు తావిస్తోంది. అభిమానముంటే మనసులో పెట్టుకోవాలేగానీ ఇలా ప్రయాణీకులు తిరిగే ప్రాంతమైన బస్టాండులోని రిజర్వేషన్ కౌంటర్ వద్ద ఏర్పాటు చేయడం తగదని పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంగా సంబంధిత అధికారులు కూడా పట్టించుకోకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.



కడప ఆర్టీసీ బస్టాండులో వివాదాస్పద రీతిలో ఏర్పాటు చేసిన బోర్డు

కడప తహసీల్దార్‌గా నారాయణరెడ్డి



కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప తహసీల్దార్‌గా ఎంవీ నారాయణరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల నేపథ్యంలో తిరు పతి జిల్లాకు వెళ్లిన నారాయణరెడ్డిని ప్రభుత్వం తహసీల్దార్ల బదిలీల్లో భాగంగా జిల్లాకు పంపించింది. ఈ మేరకు కలెక్టర్ ఆయనను కడప తహసీల్దార్‌గా నియమించడంతో ఇప్పటివరకు బాధ్యతలు నిర్వర్తిస్తున్న శివారెడ్డి నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు.

ప్రజా సమస్యలకు పరిష్కారం చూపాలి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్రన్

కడప కార్పొరేషన్ : ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ రాకేష్ చంద్రన్ ఆదేశించారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలోని వీసీ హాలులో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఇందులో మొత్తం 26 అర్జీలు రాగా, ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన అర్జీలు-8, టౌన్ ప్లానింగ్ విభాగం-6, రెవెన్యూ విభాగం -6, హెల్త్ విభాగం-3, కడప తహసీల్దార్-1, హౌసింగ్-2 అర్జీలు వచ్చాయి. ఈ అర్జీలను పరిశీలించి సమస్యలు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అంతకుముందు అదనపు కమిషనర్ మార్నింగ్ విజిట్‌లో భాగంగా బళ్లారి రోడ్, మాచుపల్లి బస్టాండ్, పాత బస్టాండ్, జెడ్పీ ఆఫీసు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు, అభివృద్ధి పనులను పరిశీలించారు.

గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన



జడ్జి బాబా ఫక్రుద్దీన్

కడప ఎడ్యుకేషన్ : విద్యార్థి దశ నుంచే విద్యార్థులు గుడ్, బ్యాడ్ టచ్‌ల గురించి అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్ పేర్కొన్నారు. సోమవారం కడప మండలం ఆలంఖాన్‌పల్లి కడప పబ్లిక్ స్కూల్‌లో గుడ్, బ్యాడ్ టచ్‌లపై న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఏదైనా సమస్య ఉంటే నేషనల్ టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నెంబర్ 15100 కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి, చైర్మెన్ మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రామమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాలు తొలగించరా..?

కడప కార్పొరేషన్: కడప నగరంలో చికెన్ వ్యర్థాల తరలింపులో నగరపాలక అధికారులు ఉదాసీన వైఖరి అవలంబిస్తున్నారని 21వ డివిజన్ కార్పొరేటర్ ఎం. సుజాత విమర్శించారు. సోమవారం అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్రన్‌కు ఆమె వినతి పత్రం సమర్పించారు. నగరంలో చికెన్ వ్యర్థాలను తరలించేందుకు ఓ వ్యక్తి రూ.20లక్షలకు టెండర్ వేసి రూ.5లక్షలు మాత్రమే చెల్లించాడని, మిగతా మొత్తం చెల్లించలేదన్నారు. దాని కాలపరిమితి కూడా ఈనెలతో ముగుస్తుందన్నారు. మరో వ్యక్తితో కూడా కార్పొరేషన్ అధికారులు ఒప్పందం చేసుకున్నట్లు తెలుస్తోందన్నారు. టెండర్‌వేసిన వారు చికెన్ వ్యర్థాలను తీసుకెళ్లకపోతే నగరపాలక అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా చోద్యం చూస్తున్నారని విమర్శించారు.

జీఓ 77 రద్దు కోరుతూ ఏబీవీపీ ధర్నా

కడప సెవెన్‌రోడ్స్: ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబర్ 77ను రద్దు చేయాలని కోరుతూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కార్యకర్తలు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. పీజీ విద్యను అభ్యసించాలనుకున్న పేద విద్యార్థులకు ఈ జీఓ గుదిబండగా మారిందని ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కోడూరు మల్లికార్జున అన్నారు. తాము అధికారంలోకి వస్తూనే జీఓ నంబర్. 77 రద్దు చేస్తామని చెప్పిన నారా లోకేష్ ఇప్పుడు ఆ విషయం విస్మరించారని విమర్శించారు. జీఓ రద్దు చేసి ప్రైవేటు కళాశాలల్లో పీజీ చదివే విద్యార్థులకు కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పులు ఇవ్వాలని కోరారు. ఏబీవీపీ జిల్లా కార్యదర్శి ఎం.మాణిక్యరాజు పాల్గొన్నారు.